
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 24.4
***

ANDHRAJYOTHY



నల్లగొండ

5

గురువారం 29 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	590 (312.0450)	1,81,008	1,94,758
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.40 (4.04)	539.08	478.80
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.74 (45.36)	92,102	1,30,863

చికెన్ ధరలు | లైవ్ : రూ.139 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240



భువనగిరిలో సమావేశ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

కాల్వల పునరుద్ధరణపైనే.. ఆశలన్నీ

- సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్ష
- ఈ నెల 30న ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ శాఖ అధికారులతో భువనగిరిలో సమావేశం

కాల్వల పునరుద్ధరణ కోసం జిల్లారైతులు ఎదురుచూస్తున్నారు. కాల్వలు పూర్తిచేసి, తమ పొలాల్లోకి జలసవ్వడులు ప్రవహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటికే మంజూరైన సాగునీటి ప్రాజెక్టులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటోంది.
(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు, కావాల్సిన నిధులపై సంబంధిత శాఖల అధికారులతో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 30న భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై స్థానిక ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. సమీక్ష సమావేశాన్ని భువనగిరిలోని న్యూడైమెన్షన్ పాఠశాలలో ఏర్పాటు చేయనున్నారు. సమీక్ష సమావేశంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొంటారు. సమావేశం ఏర్పాట్లపై బుధవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ స్థలాన్ని పరిశీలించారు. మంత్రి ఈ నెల 30న 12.30గంటలకు హెలిక్యాప్టర్‌లో భువనగిరికి చేరుకుంటారు. 12.30 నుంచి 2గంటల వరకు సమీక్ష సమావేశంలలో పాల్గొంటారు. అనంతరం హుజూర్‌నగర్ నియోజకవర్గానికి వెళ్తారు.

అసంపూర్తి కాల్వల పునరుద్ధరణ

వర్షాకాలంలో మూసీలోకి ప్రవహించే ఎగువ వరద నీటిని వినియోగించుకునేందుకు కాల్వలు నిర్మాణానికి గత ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. బునాదిగాని, ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వల పునరుద్ధరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో గత 20 ఏళ్లుగా సాగునీటికోసం రైతులు నిరీక్షిస్తున్నారు. కాల్వల పునరుద్ధరణలో భాగంగా పనులు చేపట్టేందుకు ఇప్పటివరకు ముగ్గురు కాంట్రాక్టర్లు మారారు. కల్వర్టులు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఆధునికీకరణ పనులతోపాటు 40శాతం మేరకు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఈ మేరకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సాగునీటి శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, ఈ మూడు కాల్వల పునరుద్ధరణపై అంచనాలు రూపొందించాలని సూచించారు.వీటిలో బునాదిగాని కాల్వకు రూ.159.03కోట్లు, ధర్మారెడ్డి కాల్వకు రూ.129.80 కోట్లు, పిలాయిపల్లి కాల్వకు రూ.95.60కోట్లు అవసరం పడుతాయని అధికారులు అంచనాలు రూపొందించారు. మంత్రి స్వయంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తుండటంతో నిధుల మంజూరుపై స్పష్టత వస్తుందన్న నమ్మకంతో ఉన్నారు.

బస్వాపూర్ గ్రామం



నిధులు మంజూరయ్యేనా?

కాళేశ్వరం 16వ ప్యాకేజీలో భాగంగా బస్వాపూర్‌లో నృసింహసాగర్ రిజర్వాయర్‌ను 11.39 టీఎంసీలతో నిర్మించారు. రిజర్వాయర్ నిర్మాణంతో భువనగిరి మండలంలోని బీఎన్ తిమ్మాపూర్, యాదగిరిగుట్ట మండలంలోని లక్ష్మీనాయకుడితండా, చొంగల్ నాయకుడితండా గ్రామాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయి. ఈ పనులు పూర్తి కావాలంటే రైతులకు రూ.450కోట్లు మంజూరు చేయాల్సి ఉంది. భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం కింద రూ.200కోట్లు, రిజర్వాయర్ ముంపు నిర్వాసితులకు అర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.రూ.250కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలం గంధమల్లలో నిర్మించనున్న రిజర్వాయర్ పనులకోసం ఇప్పటివరకు ఎలాంటి నిధులు మంజూరుకాలేదు. రిజర్వాయర్ సామర్థ్యాన్ని 9.8టీఎంసీల నుంచి 1.5టీసీఎంలకు కుదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తుందో వేచి చూడాల్సి ఉంది.



నల్లగొండ జిల్లాలో సాగులో ఉన్న ఆయిల్‌పామ్ తోట

ఆయిల్‌పామ్ సాగుపై.. నీలినీడలు

- లక్ష్యాన్ని చేరుకోలేక చతికిలపడుతున్న వైనం
- దిగుబడులు, మార్కెటింగ్‌పై రైతులకు అపనమ్మకం
- రైతాంగానికి అవగాహన కల్పించడంలో విఫలం
- కంపెనీల నిర్లక్ష్యంతో నెరవేరని ప్రభుత్వ ఆశయం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించినప్పటికీ అనేక కారణాలతో లక్ష్యాన్ని చేరుకోలేకపోతుంది. వరికి ప్రత్యామ్నాయంగా రైతులను ఆయిల్‌పామ్ సాగువైపు మళ్లించడంకోసం చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొడుతున్నాయి. ఉద్యానశాఖ అధికారుల కొరత మూలంగా రైతుల్లో చైతన్యం కల్పించాలంటే అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

● నల్లగొండ

ప్రభుత్వం ఓ వైపు ఆయిల్‌పామ్ సాగును పెద్దఎత్తున చేపట్టాలని యోచిస్తున్నప్పటికీ సమస్యలు ఎదురవుతుండటతో ముందుకు సాగడం లేదు. నాలుగైదు సంవత్సరాల నుంచి నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుండగా, ఏడాదిన్నర క్రితం యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగవుతోంది. ఆయిల్‌పామ్ పంటను పెద్దఎత్తున సాగు చేయించి రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహించడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న ఆయిల్‌పామ్ కంపెనీలు లక్ష్యసాధనలో చేతులెత్తేసినట్లు విమర్శలు వస్తున్నాయి. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆయా కంపెనీల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపినా కంపెనీల వైఖరిలో మార్పు రాకపోవడం గమనార్హం. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి మొదలుకొని నూతన ప్రభుత్వం కూడా ఆయిల్‌పామ్‌ను ముందుకు తీసుకుపోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నప్పటికీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

రైతులకు అవగాహన కార్యక్రమాలేవీ?

ఆయిల్‌పామ్ తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడంలో ఉద్యానశాఖ వెనుకబడిందన్న విమర్శలున్నాయి. ఉద్యోగుల కొరత మూలంగా ఈ సమస్యలు వస్తున్నాయి. ఆయిల్‌పామ్ మొక్కలకోసం ఎకరాకు రూ.9600 రాయితీ ఇస్తుండగా, మరోవైపు పెట్టుబడుల కింద ఎకరానికి రూ.4200చొప్పున నాలుగు సంవత్సరాలపాటు రాయితీ ఇవ్వనున్నారు. బిందు సేద్యం కూడా 80 నుంచి 100 శాతం రాయితీ కల్పిస్తున్నారు. ఎకరాకు 57 మొక్కల చొప్పున వేయాల్సి ఉంటుంది. అయితే రైతులకు మార్కెటింగ్‌తోపాటు ఇతర సమస్యలపై పరిష్కార మార్గం చూపే వారు కరువయ్యారు. హార్టికల్చర్ అధికారుల కొరత ఉన్నందున ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు తమ ప్రతినిధుల ద్వారా రైతులకు వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. కంపెనీల ప్రతినిధులకు కూడా సరైన అవగాహన లేకపోవడంతో రైతులకు వారు ఆయిల్‌పామ్ గురించి సరైన సమాచారం ఇవ్వడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం రాయితీలు ఇస్తున్నా, ఆయిల్‌పామ్ తోటకు ఖర్చు బాగానే వస్తుందని రైతులు వాపోతున్నారు. ఒక రైతు 12 ఎకరాలు ఆయిల్‌పామ్ తోట పెట్టడానికి రూ.80వేల వరకు డ్రిప్‌కోసం డీడీ కడుతుండగా, మొక్కల కొనుగోలు రూ.15వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీయడానికి, ఎరువులు వేయడానికి, మొక్కలు నాటడానికి అదనంగా ఒక్కో మొక్క నాటేందుకు రూ.70 ఖర్చవుతుంది.

ప్రయోజనం శూన్యం

రైతులను ఆర్థికంగా గట్టెక్కించేందుకు దీర్ఘకాలికంగా లాభాలు వచ్చే ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని తలపెట్టినా అధికారులు, కంపెనీల వైఫల్యంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుంది. భద్రాద్రి కొత్తగూడెంతోపాటు ఆశ్వరావుపేటలో ఈ ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించిన ఫ్యాక్టరీలున్నాయి. ఆయిల్‌పామ్ సాగు ఫ్యాక్టరీల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి భూములతోపాటు ఇతర వనరులన్నింటినీ కల్పిస్తుంటారు. అయితే ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉండాలంటే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కూడా ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసి ఆయిల్‌పామ్ దిగుబడులను కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే కంపెనీలు ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయాలంటే వేలాది ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు ఉండటంతోపాటు దిగుబడులు కూడా రావాల్సి ఉంది. ప్రస్తుతం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో అరకొర దిగుబడులు వస్తున్నాయి. దీంతో కంపెనీలు ఫ్యాక్టరీలు ఏర్పాటుచేసే పరిస్థితి లేదు. రైతులు ఇతర ప్రాంతాల్లోకే దిగుబడులను తరలించాల్సి ఉంటుంది. మార్కెటింగ్‌పై అవగాహన లేకపోవడంతో కొందరు రైతులు కంపెనీలనే ఆశ్రయించాల్సి వస్తుంది. ఉదాహరణకు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో పతంజలి కంపెనీకి సంబంధించి 7,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాల్సి ఉండగా కేవలం 1,471 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతున్నట్లు సమాచారం. యాదాద్రి భువనగిరి జిల్లాలో సైతం ఆయిల్‌పామ్ సాగు తోటలు ఏమాత్రం ముందుకు సాగడంలేదు. రైతులు పెద్దఎత్తున పేర్లు నమోదు చేసుకున్నా, ఆ తర్వాత ఆయిల్‌పామ్ సాగుపై నీలినీడలు అలుముకుంటుండడంతో వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు రైతులు డ్రిప్‌కోసం దరఖాస్తు చేసుకొని డీడీలు కట్టిన తర్వాత వాపస్ తీసుకొన్న సందర్భాలున్నాయి. అయితే నల్లగొండ జిల్లాలో మాత్రం 10వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. మరి కంపెనీలు లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉండగా ఎందుకు వెనకంజ వేస్తున్నారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అధికార యంత్రాంగం చెబుతున్నది కాగితాలపై కాకి లెక్కలా? లేదంటే వాస్తవ పరిస్థితులా అనే దానిపై గందరగోళ పరిస్థితులు ఉన్నాయి.

ఆయిల్‌పామ్ సాగు విస్తరణ పెరిగింది



ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్‌పామ్ సాగు విస్తరణ ఉంది. గత నాలుగేళ్లుగా జిల్లాలో సాగవుతోంది. రైతులను ప్రోత్సహించి ఆయిల్‌పామ్ సాగును విస్తరించడంకోసం ముందుకు సాగుతున్నాం. జిల్లాలో 10వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగులో ఉంది. మార్కెటింగ్‌తోపాటు ఇతర విషయాల గురించి రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించనున్నాం. ప్రభుత్వం నుంచి రాయితీలు ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

● సాయిబాబా, డీహెచ్ఎస్‌వో, నల్లగొండ

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- డాక్టర్లు అన్నివేళలా అందుబాటులో ఉండాలి ● కలెక్టర్ నారాయణరెడ్డి



మిర్యాలగూడ ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, పక్కన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 28: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని, డాక్టర్లు సమష్టిగా పనిచేసి ప్రభుత్వ వైద్యసేవలపట్ల ప్రజల్లో మరింత నమ్మకాన్ని కలిగించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ప్రతీవార్డును పరిశీలించి వైద్యుల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రి వైద్యులతో సమావేశమై పలు సలహాలు, సూచనలు చేశారు. ఆస్పత్రి శుభ్రంగా ఉంచేందుకు శానిటేషన్‌పై ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. ల్యాబ్ పరీక్ష ఫలితాల్లో తప్పులు రాకూడని సిబ్బందిని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చేరోగుల పట్ల వైద్యులు సౌమ్యంగా వ్యవహరించాలని, సిబ్బంది సైతం సత్ప్రవర్తన కలిగి ఉన్నప్పుడే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులను ఎట్టిపరిస్థితుల్లో ప్రైవేటు, ఇతర ఆస్పత్రులకు పంపవద్దన్నారు. డ్యూటీ సమయంలో వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, జనరల్ మెడిసిన్, గైనిక్ విభాగాలను పటిష్టపర్చాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. రోగులకు అందించే భోజనం నాణ్యవంతంగా ఉండేలా అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. వైద్యుల పనితీరు సంతృప్తికరంగా లేకుంటే కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 18004251442 కాల్‌సెంటర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని, తమకు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనవెంట ఆర్డీవో శ్రీనివాసరావు, ఆర్ఎంవో ప్రజ్ఞారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ సమరద్, డ్యూటీ వైద్యులు తదితరులు ఉన్నారు.

● భవిష్యత్ అంతా అమ్మాయిలదే



ఆడపిల్ల పుట్టిందని బాధపడొద్దు..పెళ్లి వయసు వచ్చేనాటికి అమ్మాయిలకు ప్రాధాన్యం పెరుగుతుందని కలెక్టర్ అన్నారు. నాకు ఇద్దరూ అమ్మాయిలే.. ఆడపిల్ల ఇంటి మహాలక్ష్మి.. అన్నారు. మిర్యాలగూడ ఆస్పత్రిలో రెండో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టిందని రోదిస్తున్న ఓ మహిళతో అన్న మాటలివి.. మహిళ జన్మనిచ్చిన పాపను ఎత్తుకొని ఆడించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : మాతృనాయక్


దేవరకొండ: వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంవహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి మాతృనాయక్ అన్నారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీచేసి మాట్లాడారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఇన్‌చార్జి డాక్టర్ మంగ్తానాయక్‌ను కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో

చండూరు: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని నల్లగొండ జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం చండూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని సీజనల్ వ్యాధులు, జ్వర సంబంధ కేసులపై ఆరా తీశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై, రోగులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలో పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఆస్పత్రిలో ప్రసూతి కేసులు పెరిగేలా చూడాలన్నారు. ఆయనవెంట జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా శ్రీవాణి

నల్లగొండ, ఆగస్టు 28: నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎస్.శ్రీవాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ రాధాకృష్ణనుంచి ఆమె చార్జ్ తీసుకున్నారు. ప్రినిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ రాజకుమారి బదిలీల్లో భాగంగా గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా శ్రీవాణిని ప్రభుత్వం నియమించింది.



డీసీసీబీలో.. కోల్డ్ వార్

- ఓ అధికారికి, సీనియర్లకు మధ్య తీవ్ర విభేదాలు
- అధికారాలకు కత్తెర వేశారంటూ ఆరోపణలు
- పలుచోట్ల బ్రాంచ్ మేనేజర్లకే కర్ర పెత్తనం
- నేడు సమన్వయంకోసం అత్యవసరంగా అంతర్గత సమావేశం

జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఓ అధికారికి, సీనియర్ అధికారులకు మధ్య తీవ్ర విభేదాలు పొడచూపినట్లు విశ్వసనీయ సమాచారం. సదరు అధికారి సీనియర్లను జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకే పరిమితంచేసి వారి అధికారాలకు కత్తెర వేయడంతో సమన్వయం కొరవడినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా ఏదో ఒక సమస్య ఏర్పడుతున్నప్పటికీ గత వారం రోజులుగా మాత్రం సమస్య జటిలంగా మారినట్లు వినికిడి.

నల్లగొండ

డీసీసీబీలో ప్రస్తుత పాలకవర్గంలోని గత చైర్మన్ ఉన్న సమయం నుంచి మొదలుకొని నూతన చైర్మన్ వచ్చిన తరువాత కూడా ఈ అధికారికి, ఇతర అధికారులకు మధ్య తరుచూ విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 27న జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వచ్చిన సందర్భంలో అధికారుల మధ్య విభేదాలను గమనించి మందలించినట్లు తెలిసింది. అయితే సీనియర్ అధికారులు తమకు సదరు అధికారి వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇదే విధంగా ఉంటే తాము సెలవుల్లోకి వెళ్లిపోతామని తెలియజేసినట్లు సమాచారం. అయితే ఉన్నతాధికారితోపాటు తొమ్మిది మంది సీనియర్ అధికారులను సమన్వయం చేయడంకోసం చైర్మన్ గురువారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఇప్పటికే డీసీసీబీ బ్యాంకు రూ.2300కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతున్న నేపథ్యంలో రూ.3వేల కోట్లకు చేర్చడంకోసం చైర్మన్‌తోపాటు పాలకవర్గ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ సమయంలో అందుకు అధికారులు, ఉద్యోగుల సహకారం కూడా అందాల్సిన సమయంలో సీనియర్ల మధ్య విభేదాలు బ్యాంకు ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రమాదం ఉండటంతో పాలకవర్గం అప్రమత్తమైంది.

బ్యాంకును అభివృద్ధి చేయడం కోసం

బ్యాంకును మరింత అభివృద్ధి చేయడంకోసం సంస్కరణలు చేపడుతుంటే, కొంత మంది సీనియర్లు కావాలని అడ్డుపడుతున్నట్లు సదరు ఉన్నతాధికారి విషయాన్ని పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. తాను ఎవరి అధికారాలను తగ్గించలేదని, తనను బదనాం చేయడంకోసం వారే ఫీల్డ్‌లోకి వెళ్లడంలేదని వివరించారు. తాను సెలవుల్లో ఉన్నప్పుడు కూడా వారి పనులు వారు చేయకుండా తనను టార్గెట్ చేస్తున్నారని, తాను పాలకవర్గం నిర్ణయాలకు అనుగుణంగా బ్యాంకును ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నట్లు సమాచారం. సీనియర్ అధికారులు మాత్రం తమకు బాధ్యతలు ఇవ్వకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు చైర్మన్‌కు చెప్పినట్లు తెలిసింది. కొన్ని బ్రాంచ్‌లలో మేనేజర్లను పక్కనబెట్టి అసిస్టెంట్ మేనేజర్లకు బాధ్యతలు ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మొత్తానికి ఓ ఉన్నతాధికారికి, సీనియర్లకు మధ్య విభేదాల నేపథ్యంలో గురువారం నాడు చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అంతర్గత సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు జరగబోతున్నాయి? అధికారుల మధ్య విభేదాలు తొలగిపోతాయా? అనేది తేటతెల్లం కానుంది.

బ్యాంక్ అభివృద్ధి కోసమే నిర్ణయాలు : సీఈవో శంకర్‌రావు

జిల్లా సహకార కేంద్ర బ్యాంకును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి నిర్ణయాలు తీసుకుంటున్నానని సీఈవో శంకర్‌రావు తెలిపారు. సీనియర్ల అధికారాలను ఏ మాత్రం తొలగించలేదన్నారు. ఫీల్డ్‌కు వెళ్లడానికి వారికి పూర్తిగా అధికారాలున్నాయన్నారు. బ్యాంకు అభివృద్ధికోసం తీసుకుంటున్న సంస్కరణల మూలంగా భవిష్యత్‌లో డీసీసీబీ రాష్ట్రంలోనే ప్రథమ స్థానం చేరుకోవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

నల్లగొండ టౌన్, ఆగస్టు 28: 'సమగ్ర శిక్ష'లో అంకితభావంతో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల మహేందర్ అన్నారు. బుధవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు డీఈవో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం సెప్టెంబరులో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి టీపీసీసీ హోదాలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు బేసిక్ పే అమలు పర్చాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనేక మంది మంత్రులను కలిసి విన్నవించినప్పటికీ న్యాయం జరగలేదన్నారు. కార్యక్రమంలో సీసీవో జిల్లా అధ్యక్షుడు వై.వెంకట్, సీఆర్పీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కృష్ణ, నాగరాజు, పుష్పలత, నాయకులు రాజు, మంజుల, విజయశ్రీ, ఎండీ.రహీం, వెంకట్, దేవ, సుజాత, చంద్రకళ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న మహేందర్

నేడు యాదాద్రి భువనగిరి జిల్లాకు గవర్నర్



యాదాద్రి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి), ఆలేరు రూరల్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. జనగాం జిల్లాలో పర్యటన ముగిసిన తర్వాత జిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శించనున్నారు. ఈ మేరకు జిల్లాయంత్రాంగం గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పూర్తి చేసింది. మధ్యాహ్నం 2.20గంటలకు ఆలేరు మండలం కొలనుపాకలోని జైన దేవాలయంతోపాటు సోమేశ్వర ఆలయాన్ని సందర్శిస్తారు. 3గంటలకు భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరి ఆలయాన్ని దర్శించుకుని, పూజల్లో పాల్గొంటారు. సాయంత్రం 4.15గంటలకు జిల్లా అధికారులతో సమావేశమవుతారు. ఐదు గంటలకు జిల్లాలోని ప్రముఖ రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీతలతో సమావేశం కానున్నారు. గవర్నర్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఆర్డీవో అమరేందర్‌రెడ్డి కొలనుపాకలో పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో సత్యాంజనేయప్రసాద్, ఆర్ఐ తదితరులున్నారు.

యాదగిరీశుడి సన్నిధిలో వైశేషిక పూజలు



స్వామి, అమ్మవార్లకు తిరువీధిలో వెండిజోడు సేవ

భువనగిరి అర్బన్, ఆగస్టు 28: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో బుధవారం కణ్ణన్ తిరునక్షత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. నిత్యపూజల అనంతరం వైశేషిక పూజలు చేపట్టారు. సామూహిక భగవద్గీత పారాయణం, ఉత్సవమూర్తులకు సాయంత్రం విశేషసేవను తిరుమాఢ వీధిలో ఊరేగించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతకపఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్టఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.21,66,584 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

మట్టపల్లిలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



మట్టపల్లిలో ఉట్టికొడుతున్న యువకులు

మఠంపల్లి: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రంతో పాటు పెదవీడు తదితర గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన శ్రీకృష్ణుని వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మట్టపల్లి దేవస్థాన ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, అర్చకుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

శివాలయ రాజగోపురానికి శంకుస్థాపన



రాజగోపురం భూమిపూజలో పాల్గొన్న అర్చకులు, చైర్మన్

మేళ్లచెర్వు : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో దక్షిణ రాజగోపురానికి వేదపండితులు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఆలయ రాజగోపుర నిర్మాణనికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గతంలోనే రూ.55లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శంభిరెడ్డి, ఈవో కొండారెడ్డి, అర్చకులు, కొంకపాక రాధాకృష్ణమూర్తి, కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, సభ్యుడు కమతం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టార్గెట్ బాల్ రిఫరీగా నగేష్



గరిడేపల్లి, ఆగస్టు 28 : సెకండ్ సౌత్ జోన్ టార్గెట్ బాల్ రిఫరీగా సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గారకుంటతండా గ్రామానికి చెందిన గుగులోతు నగేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర టార్గెట్ బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి రేవంత్, ప్రెసిడెంట్ వినోద్‌కుమార్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30వ తేదీ నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లాలో రాయచోట్ అర్చన కళాశాలలో నిర్వహించే సౌత్ జోన్ పోటీల్లో నగేష్ రిఫరీగా వ్యవహరించనున్నారు. నగేష్ ఎంపికపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ గుగులోతు బాబునాయక్, సైదానాయక్, సందీప్‌నాయక్, రమేష్‌నాయక్, బిక్షంనాయక్ హర్షం వ్యక్తం, చేసి నగేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో హోరాహోరీ

- డిజిటల్ సభ్యత్వం, ఆన్‌లైన్ ఓటింగ్
- ప్రతీ సభ్యుడు ఆరుగురిని ఎన్నుకునే అవకాశం
- సభ్యత్వ రుసుం రూ.50

మోత్కూరు, ఆగస్టు 28: రాష్ట్ర వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల పోరు సాగుతోంది. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూత్ కాంగ్రెస్ ఎన్నికల పోరు హోరాహోరీగా సాగుతోంది. మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పదవులకు చాలా మంది పోటీ పడుతుండటం, పోటీ చేస్తున్న అభ్యర్థులు వాట్సాప్ గ్రూపుల్లో (సోషల్ మీడియాలో) ముమ్మర ప్రచారం సాగిస్తుండటంతో యూత్ కాంగ్రెస్ ఎన్నికలు ఆసక్తిని పెంచుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలకు ఆన్‌లైన్ ఓటింగ్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది.

ఒక్కో ఓటరుకు ఆరు ఓట్లు

యూత్ కాంగ్రెస్‌లో చేరాలనుకునే వారు ప్లేస్టోర్ నుంచి ఐవైసీ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని సభ్యత్వం తీసుకోవాలి. 18 నుంచి 35 లోపు వయస్సు ఉన్నవారు మాత్రమే యూత్ కాంగ్రెస్ సభ్యత్వానికి అర్హులు. రూ.50 సభ్యత్వ రుసుం చెల్లించి సభ్యత్వం తీసుకోవాలి. ప్రతీ సభ్యుడికి ఓటు హక్కు ఉంటుంది. ప్రతీ సభ్యుడు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను, నియోజకవర్గ, మండల అధ్యక్షులను ఎన్నుకోవడానికి ఓటు వేయాలి.

14 నుంచి ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ

రాష్ట్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల, నియోజకవర్గ, మండల అధ్యక్ష పదవుల ఎన్నికకు జూలైలో నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. ఈ నెల 14 నుంచి ఆన్‌లైన్ ఓటింగ్ ప్రారంభమైంది. సెప్టెంబరు 14 వరకు (నెల రోజులు) ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. యువతీ, యువకులు ఇప్పుడు సభ్యత్వం తీసుకుని కూడా ఓటు వేయవచ్చు. దీంతో పోటీలో ఉన్న అభ్యర్థులు తమ గెలుపు కోసం ముమ్మరంగా ప్రచారం చేయడంతో పాటు యువతీ, యువకులతో సభ్యత్వం నమోదు చేయిస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేనంతగా పోటీ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గతంలో ఎన్నడూ లేనంతగా యూత్ కాంగ్రెస్ పదవుల కోసం నాయకులు పోటీ పడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్ష పదవికి 13 మంది, ప్రధాన కార్యదర్శికి 16 మంది, సూర్యాపేట జిల్లా అధ్యక్ష స్థానానికి 13 మంది, ప్రధాన కార్యదర్శి స్థానానికి 22 మంది, నల్లగొండ జిల్లా అధ్యక్ష స్థానానికి 12 మంది, ప్రధానకార్యదర్శి స్థానానికి 33 మంది పోటీ పడుతున్నారు. నియోజక వర్గాల ప్రాతిపదికన జిల్లా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మోత్కూరు, అడ్డగూడూరు మండలాలు యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్నప్పటికీ తుంగతుర్తి నియోజక వర్గంలో ఉండటంతో ఈ రెండు మండలాల యూత్ కాంగ్రెస్ ఓటర్లు సూర్యాపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అభ్యర్థులకే ఓటు వేయాలి. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న రామన్నపేట మండలం నకిరేకల్ నియోజకవర్గంలో ఉన్నందున ఆ మండల యూత్ కాంగ్రెస్ ఓటర్లు నల్లగొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి అభ్యర్థులకు ఓటు వేయాల్సి ఉంటుంది. తుంగతుర్తి నియోజక వర్గ అధ్యక్ష పదవికి 36 మంది, మోత్కూరు మండల అధ్యక్ష పదవికి ఆరుగురు పోటీ పడుతున్నట్టు చెబుతున్నారు.

ఓడిన వారికీ కమిటీ ఎంపికలో ప్రాధాన్యం

ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన వారికి వారికి వచ్చిన ఓట్లననుసరించి జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల్లో ఉపాధ్య, కార్యదర్శి పదవులకు ప్రాధాన్యం ఇస్తారంటున్నారు. ప్రతీ కమిటీలో ఎస్సీ, ఎస్టీ, మహిళ, మైనార్టీ వారు తప్పకుండా ఉండేలా కమిటీని ఏర్పాటు చేస్తారంటున్నారు. గతంలో లాగా నాయకులకు నచ్చిన వారిని పదవుల్లో నియమించే అవకాశం లేకపోవడంతో వివిధ పదవులకు పోటీ చేస్తున్న వారు గెలుపు కోసం ముమ్మరంగా శ్రమిస్తున్నారు.

త్రిపుల్‌ఆర్ జంక్షన్ల కోసం భారీగా భూసేకరణ

- భూనిర్వాసితుల జాబితాకు సిద్ధమైన రెవెన్యూ యంత్రాంగం



త్రిపుల్ ఆర్ జంక్షన్ ఏర్పాటు జరిగే ప్రాంతాలు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 28 : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై ఏర్పాటుచేయనున్న త్రిపుల్‌ఆర్ ఇంటర్ చేంజ్ జంక్షన్లలో భారీ భూసేకరణ జరుగనుంది. వాటికి సంబంధించి ఆస్తులను కోల్పోతున్న నిర్వాసితుల జాబితాను సిద్ధం చేయడంలో రెవెన్యూ శాఖ నిమగ్నమైంది. జాబితా రెండు, మూడు రోజుల్లో పూర్తి కానుందని అధికారవర్గాలు తెలిపాయి. జాతీయ రహదారికి ఉత్తర, దక్షిణ భాగాల్లో నిర్మితం కానున్న ఈ జంక్షన్ల కోసం 193ఎకరాలను సేకరించనున్నారు. చౌటుప్పల్, తంగడపల్లి, లింగోజిగూడెం, తాళ్లసింగారం గ్రామాల్లోని 193ఎకరాల భూములను కేటాయిస్తున్నారు. ఈ భూములకు సంబంధించి వారం రోజుల కిందట రెవెన్యూ, ఎన్‌హెచ్ ఏఐకి చెందిన ఏజెన్సీ బృందాలు సర్వే నిర్వహించి హద్దులను నిర్ధారించాయి. డ్రోన్ సర్వే చేసిన ఈ భూములను రెవెన్యూ సర్వేయర్‌లు సర్వే చేశారు. దీంతో విస్తీర్ణంలో కొద్దిపాటి చేర్పులు, మార్పులు జరిగే అవకాశాలు ఉండే అవకాశం ఉందంటున్నారు. రెవెన్యూ సర్వేయర్లు చేసిన సర్వేతో ఖచ్చితమైన భూముల విస్తీర్ణం తేలనుంది.

రెవెన్యూ పరిధి	విస్తీర్ణం (చదరపు మీటర్లు)	ఎకరాలు
చౌటుప్పల్	6,60,452	163.20
తాళ్లసింగారం	45,256	11.18
లింగోజీగూడెం	11,147	2.75
తంగడపల్లి	67,448	16.67

రెండు రోజుల్లో భూనిర్వాసితుల జాబితా



త్రిపుల్‌ఆర్ జంక్షన్లలో ఆస్తులను కోల్పోతున్న భూనిర్వాసితుల జాబితాను రెండురోజుల్లో పూర్తిచేస్తాం. జాబితాను సిద్ధం చేశాక నిర్వాసితులకు తెలియజేస్తాం. జాబితాలో ఎలాంటి అవకతవకలు లేకుండా పకడ్బందీగా రూపొందిస్తున్నాం. జాబితాలో ఏమైనా పొరపాట్లు జరిగితే సవరణలు చేస్తాం. భూ నిర్వాసితులు ఎలాంటి ఆందోళన చెందవద్దు.

హరికృష్ణ, తహసీల్దార్, చౌటుప్పల్

రెండు ప్లాట్లు కోల్పోతున్నా



త్రిపుల్ ఆర్ రహదారి కోసం 146 గజాలకు సంబంధించి రెండు ప్లాట్లను కోల్పోతున్నా. కష్టపడి రూపాయికి, రూపాయి పోగు చేసుకుని భవిష్యత్ కోసం ఈ ప్లాట్లు కొనుగోలు చేశా. త్రిపుల్‌ఆర్ జంక్షన్ వస్తుందని, అందులో నా ప్లాట్లు పోతాయని కలలో కూడా ఊహించలేదు. ఓపెన్ మార్కెట్ విలువ ప్రకారంగా ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

పోలోజు శ్రీనివాస్‌చారి, ఆర్టిస్ట్, చౌటుప్పల్

ఉన్న భూమిని అమ్మి సర్వీసింగ్ సెంటర్ పెట్టా



రెండేళ్ల కిందట రూ.1.25 కోట్లు వెచ్చించి 65వ నంబరు జాతీయ రహదారి వెంట 243 గజాల విస్తీర్ణంలో వాహనాల సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నా. ఇందుకోసం ఏపీలోని కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నాకు ఉన్న మూడు ఎకరాల భూమిని విక్రయించా. త్రిపుల్‌ఆర్ జంక్షన్ ఇక్కడి నుంచి వెళ్తుందని ఊహించలేదు. సాఫీగా సాగిపోతున్న నా జీవితం కష్టాల్లో పడే అవకాశం నెలకొంది. నా కుటుంబ పరిస్థితిని గమనించి ప్రభుత్వం ఓపెన్ మార్కెట్ విలువ ప్రకారంగా నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి. లేని పక్షంలో మా కుటుంబం వీధిన పడాల్సి వస్తోంది.

మాదిరెడ్డి పాండు, వాహన సర్వీసింగ్ సెంటర్,చౌటుప్పల్

మరిన్ని పతకాల సాధనే లక్ష్యం

- ప్రపంచ ర్యాంక్ మెరుగుపర్చుకునే లక్ష్యంతో క్రీడాకారుల పోటీ
- ప్రత్యర్థులతో పోటాపోటీగా తలపడుతున్న భారత క్రీడాకారులు



భువనగిరి టౌన్, ఆగస్టు 28 : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో నిర్వహిస్తున్న ప్రపంచ అండర్-18 టెన్నిస్ సిరీస్ పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటేందుకు యత్నిస్తున్నారు. తమర్యాంకులను మెరుగుపర్చుకోవడంతో పాటు దేశానికి పతకాలు సాధించే లక్ష్యంగా సాగుతున్నారు. భువనగిరిలో సింగిల్స్, డబుల్స్ పోటీల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో ఎనిమిది గ్రౌండ్లను నిర్మించారు. విజేతలుగా నిలిచేందుకు క్రీడాకారులు పోటీపడుతున్న తీరు అద్భుతంగా ఉందని టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిరీస్ మొత్తంలో 250కి పైగా మ్యాచ్‌లు జరుగనున్నాయి. శుక్రవారం డబుల్స్, బాలికల సింగిల్స్ ఫైనల్స్ జరుగనుండగా శనివారం బాలుర ఫైనల్స్ జరుగుతాయి. విజేతలకు 60 పాయింట్లు లభించి ప్రపంచ జూనియర్స్‌లో వారి ర్యాంక్ మెరుగుపడనుంది. విజేతలకు ప్రపంచ జూనియర్ ర్యాంకింగ్స్‌లో 60పాయింట్లు దక్కనున్నాయి. ఆ తర్వాత స్థానాలకు కూడా పాయింట్లు లభించి ర్యాంక్‌లు మెరుగుపడుతాయి.

సెప్టెంబరు 1 నుంచి 5 వరకు వెటరన్ సిరీస్

అండర్-18 టెన్నిస్ సిరీస్ ముగిసిన వెంటనే న్యూడైమెన్షన్ టెన్నిస్ అకాడమీ మరో అంతర్జాతీయ టెన్నిస్ సిరీస్‌కు వేదిక కానుంది. సెప్టెంబరు 1 నుంచి 5 వరకు ప్రపంచ వెటరన్ టెన్నిస్ సిరీస్ ఇదే వేదికలో జరుగనుంది. 30 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయస్సు వరకు స్త్రీపురుషులకు వేర్వేరుగా పలు కేటగిరీల్లో జరిగే మ్యాచ్‌లకు సుమారు 70మంది క్రీడాకారులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్ 29 నుంచి మే 4 వరకు నేషనల్ అండర్-12 టెన్నిస్ సిరీస్ జరుగగా ఆగస్టు 24 నుంచి 31 వరకు అంతర్జాతీయ అండర్-18 పోటీలు తాజాగా సెప్టెంబరు 1 నుంచి 5 వరకు వెటరన్ సిరీస్ జరుగనున్నాయి. దీంతో ఆరు నెలల వ్యవధిలోనే భువనగిరి వేదికగా మూడు ప్రధాన టెన్నిస్ సిరీస్‌లు జరుగనుండడం విశేషం.

టెన్నిస్‌కు పెరుగుతున్న ఆదరణ



రాష్ట్రంలో టెన్నిస్‌కు ఆదరణ పెరుగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 180 టెన్నిస్ అకాడమీలు, 200 మందికిపైగా కోచ్‌లు ఉన్నారు. రానున్న రోజుల్లో ఇండియాలోనే తెలంగాణ టెన్నిస్ హబ్‌గా మారనుంది. భువనగిరిలోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించడం అభినందనీయం. అయితే జిల్లా అసోసియేషన్‌లు ప్రత్యేక శ్రద్ధ చూపి స్పాన్సర్స్ సహకారంతో క్రీడాకారులను ప్రోత్సహిస్తేనే నూతన క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. టెన్నిస్ అకాడమీల నిర్వాహణతో పాటు నిరంతరం కోచింగ్, టోర్నీలు నిర్వహిస్తే క్రీడాకారులకు ఉపయోగం ఉంటుంది. అలాగే టెన్నిస్‌పై ఆసక్తి ఉన్న క్రీడాకారులను వెతికి పట్టుకోవాల్సిన బాధ్యత కూడా టెన్నిస్ అకాడమీలదే.

శివకుమార్‌రెడ్డి, ఐటీఎఫ్ పరిశీలకుడు.


మెరుగైన ర్యాంక్ కోసం సిరీస్ దోహదం



భువనగిరిలో నిర్వహిస్తున్న ఐటీఎఫ్ అండర్-18 టెన్నిస్ సిరీస్ క్రీడాకారుల ప్రపంచ ర్యాంక్ మెరుగు పడేందుకు దోహదపడుతుంది. నిర్వాహణ, ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయి. 2023 సిరీస్ విన్నర్‌నైనా నేను ఈ ఏడాది చివరి నాటికి ప్రపంచ 150వ ర్యాంక్‌కు చేరుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నా. భవిష్యత్‌లో టెన్నిస్ పోటీల్లో భారత్‌కు పథకాలు తేవడమే అంతిమ లక్ష్యం. టెన్నిస్‌పై ఆసక్తిగల క్రీడాకారులు క్రమశిక్షణతో నిత్యం మైదానంలో ప్రాక్టీస్ చేయాలి. వీలైనన్ని టోర్నీల్లో పాల్గొనాలి. తల్లిదండ్రుల సహకారం తప్పనిసరి. అయితే టెన్నిస్ ఖరీదైన ఆటగా పేరుగాంచింది. కానీ ప్రతిభ చూపితే స్పాన్సర్స్ ముందుకు వచ్చే అవకాశాలు ఉంటాయి.

రిషితరెడ్డి బసిరెడ్డి, అంతర్జాతీయ జూనియర్ 277 ర్యాంకర్, హైదరాబాద్.

పోటాపోటీగా సాగుతున్న మ్యాచ్‌లు



ఐటీఎఫ్ అండర్- 18 టెన్నిస్ సిరీస్ పోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. సమవుజ్జీలు లేదా అంతకు మెరుగైన క్రీడాకారులతో పోటీపడితేనే క్రీడాకారుల ఆటతీరు మెరుగుపడుతుంది. ఈ తరహా మ్యాచ్‌లు భువనగిరిలో సాగుతున్నాయి. అన్ని మ్యాచ్‌లలో ప్రతీ క్రీడాకారుడు చెమటోడుస్తున్నారు. సిరీస్‌లో విన్నర్‌గా నిలిచి ర్యాంక్‌ను మెరుగుపర్చుకోవడమే లక్ష్యం. అనంతరం మరిన్ని సిరీస్‌లు ఆడుతా. ఒలంపిక్స్‌తో పాటు అన్ని సీనియర్స్ పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు పథకాలు తేవడమే నా లక్ష్యం. ఇందుకోసం అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు ప్రయత్నిస్తున్నాం. టెన్నిస్ అకాడమీల ద్వారా నాణ్యమైన శిక్షణ లభిస్తోంది.

సెహత్ సింగ్ పవార్, అంతర్జాతీయ జూనియర్ 422వ ర్యాంకర్, బెంగుళూరు.

ధృడత్వం, డైట్ అతి ముఖ్యమైనవి




టెన్నిస్ క్రీడాకారులకు శారీరక ధృడత్వం, డైట్ అతి ముఖ్యం. మెడ, భుజాలు, మోచేతుల్లోని మజిల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి. ప్రతీ మ్యాచ్‌కు ముందు తప్పనిసరిగా వామప్, స్ట్రెచ్చింగ్ చేయాలి. మ్యాచ్ ముగిశాక కూడా స్ట్రెచ్చింగ్‌ను మరువద్దు. డ్రై ఫ్రూట్స్, అరటిపండ్లు మేలైనవి, మాంసాహారులైతే ఆహారంగా ప్రొటీన్స్ కోసం కోడి గుడ్లు, చికెన్ తీసుకోవచ్చు. శాఖాహారులు కూరగాయలు, ఆకుకూరలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఏమాత్రం శారీరక ఇబ్బందులు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ముఖ్యంగా ప్రతీ క్రీడాకారుడు ఫిజియోథెరపిస్ట్‌తో టచ్‌లో ఉండాలి. తేలికపాటి వ్యాయామంతో మజిల్స్ సమస్యలు తీరుతాయి. నిర్లక్ష్యం చేస్తే మైదానానికి దూరం కావాల్సిన పరిస్థితులు నెలకొంటాయి.

ఆశా కిరణ్, టెన్నిస్ సిరీస్ ఫిజియోథెరపిస్ట్, శ్రీకాకుళం.

గంటగంటకూ సంఖ్యను పెంచుతూ...

- 18 క్రస్ట్ గేట్ల నుంచి సాగర్ నీటి విడుదల



18 గేట్ల నుంచి దిగువకు కొనసాగుతున్న సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, ఆగస్టు 28: నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల సంఖ్యను గంటగంటకూ పెంచుతూ రాత్రి 7 గంటల సమయానికి 18 క్రస్ట్ గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు రోజులుగా 2 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల చేసిన ప్రాజెక్టు అధికారులు బుధవారం మధ్యాహ్నం 1 గంటకు 4 క్రస్ట్ గేట్ల ద్వారా, 3 గంటలకు 12 క్రస్ట్ గేట్లు, సాయంత్రం 4 గంటలకు 14 క్రస్ట్ గేట్లు, 7 గంటల సమయంలో 18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి వరద రాక గంట గంటకూ పెరగడంతో క్రమంగా గేట్ల సంఖ్యను పెంచుతూ దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

- శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువనుంచి 3,11,953 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి 885 అడుగులు (215.8070టీఎంసీలు) చేరుకుంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు 4 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,12,300 క్యూసెక్కులు, కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 68,708 క్యూసెక్కులు మొత్తం 1,81,008 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.
- సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 590 అడుగులుగా(312.0450టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 9,330 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8,280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,948 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, 18 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,45,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 1,94,758 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 1,81,008 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

నిలకడగా మూసీ నీటిమట్టం

మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గింది. ఎగువ ప్రాంతాల నుంచి 539.08 క్యూసెక్కుల వరద నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతోంది. 645(4.46 టీఎంసీలు)అడుగుల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టులో బుధవారం సాయంత్రానికి 643.40(4.04టీఎంసీ)అడుగులుగా ఉంది. ఆయకట్టు పరిధిలో వానాకాలం పంటల సాగు కోసం కుడి కాల్వకు 215.46 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 263.34 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పులిచింతల ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తివేత

ఉభయ తెలుగురాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం స్వల్పంగా పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175(45.77 టీఎంసీలు)అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 174.74(45.36 టీఎంసీలు)అడుగులుగా నమోదైంది. ఎగువనుంచి 92,102క్యూసెక్కుల వరద వస్తుండగా, నాలుగు యూనిట్ల ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 105మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు నాలుగు గేట్లను మూడు మీటర్లు ఎత్తి 1,14,863 క్యూసెక్కులు, ఆరు రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదల చేస్తున్నారు. మొత్తంగా 1,30,863 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



పులిచింతల క్రస్ట్‌గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

తెలంగాణ సాంస్కృతిక శిఖరం గద్దర్



గద్దర్ గానస్మరణ సీడీని ఆవిష్కరిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, ప్రొఫెసర్ ఖాసీం


సూర్యాపేట టౌన్, ఆగస్టు 28 : తన గళాన్ని తూటాగా మార్చి అన్యాయంపై గళమెత్తిన తెలంగాణ సాంస్కృతిక శిఖరం ప్రజాయుద్ధనౌక గద్దర్ అని తెలంగాణ పర్యాటక, అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏపూరి ఫౌండేషన్, ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా 'గద్దర్ గాన స్మరణ' సభలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం, కేంద్ర సాహిత్య అకాడమీ యువ అవార్డు గ్రహీత పసునూరి రవీందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజాగొంతుకై ప్రజల పక్షాన చేసిన రచనలు నిప్పు కణికలని గుర్తుచేశారు. గద్దర్ గొంతుక తెలంగాణ స్వరూపం, ధిక్కార స్వరమని స్పష్టం చేశారు. గద్దర్ మరణం తెలంగాణ సాంస్కృతిక రంగానికి తీరనిలోటన్నారు.పల్లెపాటల్లో, ఉద్యమ గీతాల్లో, విప్లవ పోరాట రచనల్లో గద్దర్ బతికే ఉంటారని అన్నారు. పోరాట తత్వాన్ని రగిల్చే గద్దర్ పాటలు ఎంతోమందికి స్ఫూర్తిదాయకమన్నారు. కళాకారులు ఆటపాటలతో గద్దర్‌ను స్మరించుకుంటూ నృత్యాలు చేశారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బహుజనయుద్ధనౌక ఏపూరి సోమన్న, అనంతుల మధు, బాసిపంగు సునీల్, వేముల పుష్ప, జీ నర్సయ్య, నవిలే ఉపేందర్, బారి అశోక్, నిద్ర సంపత్‌నాయుడు, మండారి డేవిడ్‌కుమార్, విప్లవ్‌కుమార్, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, పోలెబోయిన కిరణ్‌కుమార్, తగుళ్ల జనార్ధన్, బోనగిరి సతీష్, చెరుకు నగేష్, రాజు, గుండాల సందీప్, ఉప్పల మధు, మాధవ్, నాగేందర్, కట్ల మురళీ, కోడి బండ్లయ్య, రషీద్ పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం

సూర్యాపేట టౌన్, ఆగస్టు 28 : ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు అధికఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కోటాచలం అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసి, మాట్లాడారు. డెంగీ నిర్ధారణ కోసం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత పరీక్షలు చేస్తున్నామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకులు ఎన్ఎస్-1(స్ట్రిప్ మెథడ్) ద్వారా డెంగీ పరీక్షలు నిర్వహించవద్దని అనుమానం ఉంటే ఏలిసా పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేయాలన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

మునగాల రూరల్ : సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో కోటా చలం అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక వైద్యశాలను ఆయన పరిశీలించారు. నూతన ఆసుపత్రి భవన నిర్మాణాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట డాక్టర్ రవీందర్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం సంధ్యాసమయంలో ఆకాశంలో కనిపించిన వివిధవర్ణాలు

దేశంలో మహిళలపై లైంగిక దాడులు అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, పీవోడబ్ల్యూ, పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేట టౌన్, ఆగస్టు 28 : దేశంలో మహిళలపై లైంగిక దాడులను అరికట్టాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ శిరోమణి, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహించి, మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై లైంగిక దాడులు, భౌతిక దాడులు పెరిగాయని మండిపడ్డారు. మహిళలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు బానిసై విచక్షణ లేకుండా దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను అత్యాచారం చేసినా, ఇబ్బందులకు గురిచేసినా సరైన శిక్షలు అమలుకాకపోవడంతో నేరాలు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి రేణుక, మారసాని చంద్రకళ, సూరం రేణుక, జయమ్మ, విజయ్, ప్రవీణ్, లక్ష్మి, పావని, సంతోషిమాత, సయ్యద్, రేష్మ, ఎల్లమ్మ, నాగమ్మ, పద్మ, కల్పన , రేణుక, ఉమ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్

అర్వపల్లి, ఆగస్టు 28: సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని పడమటితండా ప్రాథమిక పాఠశాలను బుధవారం డీఈవో అశోక్ తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశాడు. ఎలాంటి సమాచారం లేకుండా ఉపాధ్యాయుడు వేమారెడ్డి విధులకు గైర్హాజర్ కావడాన్ని ఆయన గుర్తించారు. దీంతో సదరు ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడితో పాటు ఒకే విద్యార్థి ఉండడం గమనార్హం. అదే పాఠశాలలో అంగన్‌వాడీ సెంటర్ కూడా నిర్వహిస్తున్నారు.

మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ బదిలీ

సీఐగా సైదులు బాధ్యతల స్వీకరణ



సీఐ సైదులు

నల్లగొండ క్రైం, ఆగస్టు 28 : నల్లగొండ జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా పనిచేస్తున్న కరుణాకర్‌ను బదిలీ చేస్తూ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న సైదులను నియమించగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2007 బ్యాచ్‌కు చెందిన సైదులు హైదరాబాద్‌లోని వివిధప్రాంతాల్లో పనిచేశారు. ఇక్కడ సీఐగా పనిచేసిన కరుణాకర్‌ను మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐగా బదిలీ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగి మృతి : నాలుగు రోజుల తర్వాత గుర్తింపు

నల్లగొండ క్రైం, ఆగస్టు 28 : నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన నాలుగు రోజుల తర్వాత గుర్తించారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ పురుషోత్తంరాజ్(48) పానగల్ రోడ్డు అలివేలుమంగాపురం కాలనీలో నివాసముంటున్నాడు. ఈ నెల 23వ తేదీ నుంచి పురుషోత్తమ్‌రాజ్ విధులకు హాజరుకావడం లేదు. దీనికితోడు ఫోన్‌లోనూ అందుబాటులోకి రావడంలేదు. అనుమానం వ్యక్తం చేసిన తోటి ఉద్యోగులు ఆయన నివాసానికి మంగళవారం రాత్రి వెళ్లారు. తలుపులు వేసి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తలుపులు పగలగొట్టి చూడటంతో లోపల పురుషోత్తంరాజ్ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉంది.అయితే కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లడంతో ఆయన ఇంట్లో ఒక్కరే ఉన్నారు. అయితే ఈ ఘటనపై కుటుంబసభ్యులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని టూ టౌన్ ఎస్ఐ పోలీసులు తెలిపారు. పురుషోత్తంరాజ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దేవాలయంలో చోరీ ఘటనపై కేసు నమోదు

తిప్పర్తి, ఆగస్టు 28 : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం సిలార్‌మియాగూడెంలోని దేవాలయంలో చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. సిలార్‌మియాగూడెం గ్రామంలో జూన్ 2వ తేదీన రాత్రి గుర్తుతెలియని దుండగులు దేవాలయంలో ఉన్న హుండీని పగులగొట్టి అందులో ఉన్న కానుకలను అపహరించారు. ఈ ఘటనపై గ్రామానికి చెందిన యర్రమాద నరేందర్‌రెడ్డి అపహరణకు గురైన హుండీలో రూ.10 వేల వరకు నగదు ఉండవచ్చని బుధవారం ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలు

చండూరు రూరల్, ఆగస్టు 28 : తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చండూరు మండలం దోనిపాముల గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గీతకార్మికుడు గాదనబోయిన పర్వతాలు(55) మంగళవారం సాయంత్రం గ్రామశివారులో తాటిచెట్టు ఎక్కుతుండగా పైనుంచి జారిపడ్డాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు స్థానిక ప్రైవేటుఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



సూర్యాపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సూర్యాపేట టౌన్, ఆగస్టు 28 : రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగం బలోపేతం కావడంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందన్నారు. 15 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 22వేల మంది సమగ్ర శిక్షా ఉద్యోగులు పనిచేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం వీరందరిని ఆదుకోవాలన్నారు. ప్రతీ ఉద్యోగికి రూ.10లక్షల జీవిత బీమా, రూ.5లక్షలతో ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు, 61 ఏళ్లు నిండిన ఉద్యోగికి రూ.20లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలన్నారు. ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు వెంకటరమణ, శ్రీనివాస్, సయ్యద్, రాంబాబు, గుగులోతు చిన్న, ఐఆర్‌పీటు, టుటీఐలు, ఎల్‌డీలు, ఎంఎస్‌లు, పీటీఐలు పాల్గొన్నారు.

డి-40 కాల్వ నీటి విడుదల షెడ్యూల్ విడుదల

మాడ్గులపల్లి, ఆగ స్టు 28: డి-40 కాల్వ ద్వారా నీటి విడుదల చే సేం దుకు అధికారులు బుధవారం షెడ్యూల్ వి డుదల చేశారు. డి-40 కాల్వ ద్వారా నీటిని వి డుదల చేసి ఆదుకోవాల ని సోమవారం మండలంలోని ఇందుగుల గ్రా మానికి చెందిన కొంతమంది రైతులు డి-40కాల్వలో నిరసన తెలిపారు. ఈ నెల 27వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పంటలు ఎండిపోతున్నాయ్' అనే కథనం ప్రచురితమవడంతో స్పందించిన ఏఎమ్మార్పీ ఎస్ఎల్బీసీ అధికారులు సెప్టెంబరు 2 నుంచి నీటి విడుదల చేయనున్నట్లు తెలిపారు. 8వ తేదీ వరకు ఆన్ ఆఫ్ పద్ధతిలో విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఏఈ శివ మాట్లాడుతూ రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ఏడు రోజులు నీటి విడుదల ప్రక్రియ కొనసాగుతుందని, నీటిని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

● *బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి*



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వర్షిత్‌రెడ్డి

దేవరకొండ, ఆగస్టు 28: దేవరకొండ లయన్స్ క్లబ్ గ్రామీణ ప్రాంత ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. దేవరకొండ మండలం తూర్పుపల్లిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మా ట్లాడారు. లయన్స్‌క్లబ్ పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాని అన్నారు. 250 మం దికి వివిధ పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ, సభ్యులు అంకూరి నర్సింహ, సముద్రా ల ప్రభాకర్, నిరంజన్, డాక్టర్ సామేల్, నారాయణ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



డీఆర్‌డీఏ ఎదుట ఆందోళన చేస్తున్న వీవోఏలు

నల్లగొండ రూరల్ ఆగస్టు, 28: రాష్ట్రంలో వీవోఏలుగా పనిచేస్తున్న వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ ఐకేపీ వీవోఏల ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు సీహెచ్. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డీఆర్‌డీఏ పీడీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సాధికారత కోసం ప్రభుత్వ పథకాల అమలుకోసం శ్రమిస్తున్న ఐకేపీ వీవోఏలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం అమలుచేయాలన్నారు. అనంతరం ఏపీడీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిలుముల దుర్గయ్య, సులోచన, మంగమ్మ, రేణుక, పద్మ, నాగమణి పాల్గొన్నారు.

ఊరూరా బోనాల జాతర

● *భక్తిశ్రద్ధలతో దేవతామూర్తులకు నైవేద్యం సమర్పణ*



బోయినపల్లిలో బోనమెత్తిన మహిళలు

కనగల్, ఆగస్టు 28: మండలంలోని బోయినపల్లి, పర్వతగిరి, బుడుమర్లపల్లి, దర్వేశిపురం తదితర గ్రామాల్లో బుధవారం శ్రావణమాస బోనాల జాతరను నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో ఊరేగింపుగా బోనాలు ఎత్తుకుని గ్రా మ శివారులోని ఆలయాలకు చేరుకున్నారు. ఆలయ ప్రదక్షిణలు చేసి దేవతామూర్తులకు బోననైవేద్యాలను సమర్పించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండి కరువు తొలగాలని వేడుకున్నారు. గ్రామాలను చల్లగా చూడాల ని కోరుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు గానూతుల భాస్కర్‌రెడ్డి, బిచ్చాల శ్రీను, ఎల్లేషం, నూనె సైదులు, ప్రేమయ్య, జానయ్య పాల్గొన్నారు.

నేడు క్రీడల శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 28: సుప్రసిద్ధ భారతీయ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి, క్రీడల అభివృద్ధి అధికారి మగ్బూల్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. వాక్, రన్, షాట్‌పుట్, చెస్, బ్యాడ్మింటన్, టగ్‌ఆఫ్‌వార్, వాలీబాల్ పోటీలు 50 సంవత్సరాలు, పైబడిన స్త్రీ, పురుషులకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ఆసక్తిగల ప్రభుత్వ ఉద్యోగులు, క్రీడాకారులు ఉదయం 8 గం టలకు పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

పెండింగ్‌లో డీఏలను ప్రకటించాలి : యూటీఎఫ్



సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

కొండమల్లేపల్లి, ఆగస్టు 28: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయలు ఉన్న ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ సోషల్‌మీడియా రాష్ట్ర కన్వీనర్ బక్క శ్రీనివాసచారి డిమాండ్ చేశారు. బుధవారం కొండమల్లేపల్లిలో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్ కొండమల్లేపల్లిశాఖ నూతన సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెరుగుతు న్న ధరలకు అనుగుణంగా ఉద్యోగులకు డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశా రు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఉపాధ్యాయుల పక్షాన పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో మల్లేపల్లి అధ్యక్ష, కార్యదర్శులు సంజీవకుమార్, శ్రీరాములు, భాను, జనార్దన్‌రెడ్డి, గోవర్ధన్‌రావు, ముత్యాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

వేములపల్లి, ఆగ స్టు 28: విద్యార్థులకు ప్రభుత్వం మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఎంపీడీవో శారదాదేవి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌ను బుధవారం ఆమె సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. భోజనం వండే సమయంలో శుభ్రమైన నీటిని వినియోగించి నాణ్యమైన కూరగాయలతో భోజనాన్ని వండాలన్నారు. ఉపాధ్యాయులు సైతం తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధను కనబరిచి పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా కార్యాచరణతో రూపొందించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాపాధ్యాయులు రమేష్, కార్యదర్శి శ్రవణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ ఎరియర్స్ వెంటనే చెల్లించాలి

రామగిరి, ఆగస్టు 28: మునిసిపల్ కార్మికులకు పెండింగ్ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎండి సలీం డిమాండ్ చేశారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లగొండ మునిసిపాలిటిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు రావాల్సిన 11వ పీఆర్సీ పెండింగ్ ఎరియర్స్ తక్షణమే ఇప్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పట్టణంలో కొంతమంది కౌన్సిలర్లు వాళ్ల బంధువులు కూడా కార్మికులను బూతులు తిడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ ఎరియర్స్, సెలవులు, బట్టలు, చెప్పులు తక్షణమే ఇవ్వాలని, లేనిచో పనులు నిలిపివేసి సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కార్యదర్శి పెరిక కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్ల సంజీవ, కోశాధికారి పాలడుగు వెంకటేశం, కృష్ణవేణి, ఎల్లమ్మ, పాండు, లింగయ్య పాల్గొన్నారు.

రుణమాఫీ సర్వేకు రైతులు సహకరించాలి

● *రేషన్ కార్డు లేని వారి వివరాల సేకరణ*



వేములపల్లి: శెట్టిపాలెంలో వివరాలు సేకరిస్తున్న ఏవో రుషేంద్రమణి

పెద్దఅడిశర్లపల్లి, వేములపల్లి, హాలియా, నకిరేకల్, కేతేపల్లి, పెద్దవూర, ఆగస్టు 28: గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నిర్వహించే రుణమాఫీ సర్వేకు రైతులు సహకరించాలని పలువురు వ్యవసాయ అధికారులు కోరారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు నమోదు చేసేందుకు రైతు భరోసా రుణమాఫీ పేరుతో యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో బుధవారం సర్వే నిర్వహించి సిబ్బంది రైతుల వివరాలు నమోదు చేస్తున్నారు. రుణమాఫీ సర్వే కోసం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సిబ్బంది గ్రామాలకు వచ్చే రోజు రైతులంతా పూర్తి వివరాలతో అందుబాటులో ఉండాలని కోరారు. రేషన్‌కార్డు లేని కారణంగా రుణమాఫీ ఆగిన రైతుల వివరాలు సేకరించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ యాప్‌లో మెదటగా ఇంటి యాజమాని, ఆ తర్వాత భార్య, కు మారుడు, కుమార్తె, ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్‌కార్డు నెం బర్లు, తీసుకున్న రుణాలు వంటివి పరిశీలించి రెండు లక్షల రూపాయల వరకు పొందుపరచనున్నారు. ఇది ఒక సెల్ఫ్ డిక్లరేషన్ పత్రంతో పొందుపరిచి సంబంధిత రైతుతో సంతకం చేయించనున్నారు.

● పెద్దఅడిశర్లపల్లి మండల వ్యవసాయ అధికారి రావుల పాండు మాట్లాడుతూ రైతులు సర్వేకు సహకరించాలని కోరారు. 28న కేశంనేనిపల్లి, ఘనపురం, 29న గుడిపల్లి, 30న ఘనిపల్లి, భీమనపల్లి, 31న పోల్కంపల్లి, మాదాపురం, సెప్టెంబరు 2న బాలాజీనగర్, పీఏపల్లి, 3న అంగడిపేట, అక్కంపల్లి, 4న చింతల్‌తండా, వద్దిపట్ల, 5న అజ్మాపురం, ఎర్రగుటతండా, 6న రంగారెడ్డిగూడెం, మేడారం, 9న దుగ్యాల, 10న తిరుమలగిరి, 11న రోళ్లకల్లు, సూరేపల్లి, చిలకమర్రి, 12న నెమలిపురం గ్రామాల్లో ఇంటింటి సర్వే ఉంటుందని, రైతులందరూ అధికారులకు సహకరించాలని కోరారు.

● కేతేపల్లిలోని కొర్లపహాడ్, కొండకిందిగూడెం గ్రామాల్లో ఏవో బొక్క పురుషోత్తం ఆధ్వర్యంలో రుణమాఫీ సర్వే నిర్వహించారు. రుణమాఫీ కానీ రైతుల వివరాలు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతుల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రుణమాఫీ సర్వే షెడ్యూల్ ప్రకారం సిబ్బంది గ్రామాలకు వచ్చే రోజు రైతులంతా పూర్తి వివరాలతో అందుబాటులో ఉండాలని కోరారు. మండలంలోని 308మంది రైతు కుటుంబాల నిర్ధారణ చే యాల్సి ఉందన్నారు. ఆయన వెంట ఏఈవోలు బాలరాజు, నాగరాజు ఉన్నారు.

● వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో రుణమాఫీ ఫ్యామిలీ సర్వేను ఏవో రుషేంద్రమణి ప్రారంభించి మాట్లాడారు. రైతుల నుంచి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. గురువారం రావులపెంట, ఈ నెల 30న తిమ్మారెడ్డిగూడెం, 31న బుగ్గబావిగూడెం, వచ్చే నెల 3న అన్నపరెడ్డిగూడెం, 4న మొల్కపట్నం, 5న సల్కునూరు, 6న వేములపల్లి, 9న ఆమనగల్లు, 10న చలిచీమలపాలెం, 11న కామేపల్లి, 12, ఇటిక్యాల, ముండ్లపహాడ్ గ్రామాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు.

● అనుముల మండలం శ్రీనాథపురం గ్రామంలో సర్వే నిర్వహించినట్లు ఏవో సరిత తెలిపారు. అదే విధంగా 29వ తేదీన ముక్కమాల, 30న అనుముల, 31న పులిమామిడి, సెప్టెంబరు 2వ తేదీన కొత్తపల్లి, 3వ తేదీన పేరూరు, మదారిగూడెం, కొరివేనిగూడెం, 4న పాలెం, 5న అన్నారం, తిమ్మాపురం, 9వ తేదీన కెకె కాల్వ, ఇబ్రహీంపేట, 11 పుల్లారెడ్డిగూడెం, వీర్లగడ్డ, 12 రామడుగు, 13 వీటీపాలెం, 18న అంబట్‌ప ల్లి, 19న హజారీగూడెం, నాయుడుపాలెం, 20న మారేపల్లి, 21న యాచారం, 23న చల్మారెడ్డిగూడెం, కొట్టాల, 24న కొసలమర్రి, 25వ తేదీన కుపాస్‌పల్లి గ్రామాల్లో రుణమాఫీ కానీ వారి కుటుంబ సర్వేలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

● నకిరేకల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఏవో మహ్మద్ జానిమియా తెలిపారు. మండలంలో 1450 మంది రైతు కుటుంబాలను నిర్ధారణ చేయాల్సి ఉందని తెలిపారు.

● పెద్దవూరలో కుటుంబ సర్వేను ప్రారంభించినట్లు ఏవో సందీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని పెద్దవూర, సంగారం గ్రామాల్లో రేషన్‌కార్డులు లేని కుటుంబాలలోని సభ్యులను గుర్తించి నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయా కుటుంబాల్లోని సభ్యుల ఫోటోలను తీసుకొని యాప్‌లో నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగస్థులు ఉన్నవారిని యాప్‌లో ఇప్పటికే నమోదు చేయగా వారి వివరాలను తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో విద్యుత్ సంస్కరణలపై పోరాడాలి



అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుధాకర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, ఆగస్టు 28: అమరుల స్ఫూర్తితో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బషీరాబాగ్ జరిగిన విద్యుత్ పోరాటంలో అమరులైన వారి చిత్రపటాలకు బుధవారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నాటి విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తూ ఉద్యమాలను ఉధృతం చేయాలని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జరిగిన పోరాటంలో వీరమరణం పొందిన బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ ఘటనను గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పాలడుగు నాగార్జున, లక్ష్మీనారాయణ, అచ్చాలు, నర్సిరెడ్డి, సలీం, వి.నారాయణరెడ్డి, శంకర్, గిరి పాల్గొన్నారు.

అభాగ్యులకు అన్నదానం ఎంతో పుణ్యకార్యం

● *ఎమ్మెల్యే వేముల వీరేశం*



ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, ఆగస్టు 28: నిరుపేదలు, అభాగ్యులకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లిలో మనం స్వచ్ఛంద సంస్థ ద్వారా నిరుపేదలకు, అభాగ్యులకు ఆకలితీర్చేందుకు 9 మంది దాతల సౌజన్యంతో ఏర్పాటు చేసిన 100 మందికి నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని పేర్కొన్నారు. ఆకలితో ఉన్న వారి కడుపు నింపడం ఎంతో మంచిదన్నారు. స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు దైద నాగరాజు నిర్వహించనున్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అభినందించారు. సంస్థకు తనవంతు సహకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దైద రవీందర్, దూదిమెట్ల సత్తయ్య, బత్తుల ఊషయ్య, శ్రీనివాస్, ఎస్ఆర్ఐ మల్లేష్, మహేందర్, శ్రీను, రాజీవ్‌కుమార్, సత్తయ్య, భరత్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే వేముల వీరేశం మానవత్వాన్ని చాటుకున్నారు. బుధవారం తన పర్యటనలో భాగంగా నార్కట్‌పల్లి నుంచి అమ్మనబోలు వెళ్లుండగా అక్కనపల్లి గ్రామ శివారులో బైక్ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన ఎమ్మెల్యే తన కాన్వాయ్‌ని ఆపి బాధితులతో మాట్లాడారు. అనంతరం తన కాన్వాయ్‌లో ఒక వాహనంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. స్థానిక ప్రజలు, క్షతగాత్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

కట్టంగూరు: దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. మండలంలోని పరడ గ్రామంలో గౌడ కులస్థులు నూతనంగా నిర్మిస్తున్న కంఠమహేశ్వరస్వామి దేవస్థాన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మాద యాదగిరి, పెద్ది సుక్కయ్య, సుంకరబోయిన నర్సింహ, పెద్ది యాదగిరి, రెడ్డిపల్లి సాగర్, పుట్ట నర్సింహారెడ్డి, బద్దం శ్రీను, కొండ లింగస్వామి, సైదులు, రవి, సాయిలు, రాములు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 28: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ నిర్దేశిత జీవిత లక్ష్యాన్ని చేరుకునేందుకు కష్టపడాలని టూటౌన్ సీఐ కరుణాకర్ అన్నారు. పట్టణంలోని కేఎల్ఎస్ కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్ల వాడకాన్ని అవసరం మేరకు ఉపయోగించాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా పుస్తకాలతో సహవాసం చేయాలని అన్నారు. అనంతరం మిషన్ పరివర్తన కార్యక్రమం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు షీటీం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో షీటీం ఏఎస్ఐలు తబిత, భిక్షం, కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



కరుణాకర్

● మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐగా కోట కరుణాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ మహిళా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వ రకు వన్‌టౌన్ సీఐగా పనిచేసిన సుధాకర్ ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ వారం రోజుల క్రితం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేయగా ఆయన హైదరాబాద్‌కు వెళ్లారు. దీంతో ఖాళీ ఏర్పడిన సీఐ స్థానంలో కరుణాకర్‌కు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ ఉత్తర్వులు జారీ చేశారు. ॰రీచేయగా విధుల్లో చేరారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాలను అదుపు చేసి శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎస్ఐగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



ప్రసాద్

త్రిపురారం: త్రిపురారం ఎస్ఐగా వై. ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. నేరాలను అదుపులో ఉం చడానికి, తన వంతు కృషి చేస్తానని ఎ వరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్య లు తీసుకుంటామన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వీరశేఖర్ నల్లగొండ వీఆర్‌కు ఎటాచ్ చేశారు.

నేత్రదానంపై విస్తృత ప్రచారం జరగాలి

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 28: నేత్రదానంపై విస్తృత ప్రచారం చేయాలని లయన్స్ క్లబ్, ఐ బ్యాంకు ప్రతినిధి మాశెట్టి శ్రీనివాస్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పట్టణంలో బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానమన్న నినాదంతో నేత్రదానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఒకరి నేత్రదానంతో ఇద్దరికి చూపు వస్తే ఒకరిచ్చే అవయవదానంతో ఎనిమిది మందికి జీవం పోయవచ్చని అన్నారు. పట్టణంలో డైమండ్ ఐ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్నట్లు నివాస్ తెలిపారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి వద్ద అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మట్టిపల్లి విజయభాస్కర్, సైదులు, నాయుడు, మారం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న జర్నలిస్టులు

దేవరకొండ, ఆగస్టు 28: దేవరకొండ పట్టణానికి చెందిన జర్నలిస్టు అజ్మతుల్లా గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో దేవరకొండ డివిజన్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్, ఐజేయూ దేవరకొండ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అజ్మతుల్లా కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అజ్మతుల్లా కుటుంబానికి జర్నలిస్టులు అండగా ఉంటారని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవరకొండ డివిజన్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్(ఐజేయూ) అధ్యక్షుడు గాదె గిరిధర్‌రావు, దేవరకొండ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వైఎస్ కర్నాకర్, కర్నాటి సైదులు, నారాయణ, దువ్వ ప్రవీన్, ఇలియాజ్, పగిడిమర్రి యాదగిరి, శిరందాసు వెంకటేశ్వర్లు, అంజన్ తదితర జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించటం అభినందనీయం : సీఐ



మనోహర్, యాదయ్యను సన్మానిస్తున్న సీఐ

హాలియా, ఆగస్టు 28: కష్టపడి ఉద్యోగం సాధించడం అభినందనీయమని హాలియా సీఐ జనార్ధన్‌గౌడ్ అన్నారు. హాలియా పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న యాదయ్య కుమారుడు మనోహర్‌కు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉద్యోగం రావడంతో బుధవారం హాలియా పోలీస్‌స్టేషన్‌లో మనోహర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యాదయ్యను, మనోహర్‌ను శాలువాలతో సన్మానించి స్వీట్‌బాక్స్‌ను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సతీష్‌రెడ్డి, ఏఎస్ఐ బౌసింగ్, హెడ్‌కానిస్టేబుల్ యాదయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు విద్యార్థుల అభ్యసనంపై దృష్టి సారించాలి

● *డీఈవో బి.భిక్షపతి*



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థినిని పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

చిట్యాలరూరల్, ఆగస్టు 28: విద్యార్థులకు పుస్తక పఠనం ఎంతో ముఖ్యమని, పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధనల అనంతరం అభ్యసనంపై దృష్టిని సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.భిక్షపతి సూచించారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి జడ్పీహెచ్‌ఎస్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభ్యసనంపై తరగతి గదుల్లోకి వెళ్లి డీఈవో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. పాఠ్యాంశాల్లోని పలు ప్రశ్నలను విద్యార్థులను అడిగారు. 10వ తరగతిలో విద్యార్థులతో కలిసి డీఈవో బెంచీపై కూర్చుని పాఠ్యాంశాలను ఉపాధ్యాయులు బోధించే తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయుడి బోధనపై విద్యార్థులను ప్రశ్నలడిగారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి అభ్యసనతో సాధ్యమవుతుందన్నారు. పలుమార్లు పాఠ్యాంశాలను విద్యార్థులు అభ్యసన చేస్తే ఆయా పాఠ్యాంశాలల్లో ప్రశ్నలను పరీక్షల్లో సులువుగా రాయగలుగుతారని, సత్ఫలితాలను సాధిస్తారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులు అభ్యసనపై దృష్టిని సారించాలని పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఇన్‌చార్జి హెచ్‌ఎం గీత, ఉపాధ్యాయులు భూపాల్‌రెడ్డి, బాలయ్య, ఎండీ నహీమొద్దీన్, అష్రఫ్ అలీ, సాయిబాబా, చంద్రశేఖర్, గఫార్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం...

కట్టంగూరు: రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కట్టంగూరులోని ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యపరమైన పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. 190 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి తగిన వైద్య సలహాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అంబటి అంజయ్య, వైద్యులు రాంరెడ్డి, కె.ప్రియాంక, అనిల్ బాబు, విజయ్‌కుమార్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనగల్: మండల కేంద్రమైన కనగల్‌లో ఉట్ల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ యాదవసంఘం యువకులు ఉత్సాహంగా పాల్గొని ఉట్లుకొట్టారు. అంతకుముందు వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌సునిత్రాక్రిష్ణయ్య గౌడ్, మురళిగౌడ్, అర్చకులు వెంకటాచార్యులు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని గొడుకొండ్లలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా కృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలక కమిటీ చైర్మన్ అంగిరేకుల గోపాల్, పూరె లక్ష్మణ్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ మండల స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 30 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంఈవో మాతృనాయక్ తెలిపారు. దేవరకొండలో జరిగే క్రీడా పోటీల్లో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీల్లో పాల్గొనే వారిని ముందుగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

చింతపల్లి: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్‌పై విడుదల కావడం హర్షనీయమని బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు బాదేపల్లి పులిరాజ్ గౌడ్ అన్నారు. రాజకీయ కుట్రతో కవితను అరెస్టు చేశారని అన్నారు.

కొండమల్లేపల్లి: మండలంలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని ఏవో జానకిరాములు తెలిపారు. కొండమల్లేపల్లి పీఏసీఎస్ పరిధిలోని యూరియా నిల్వల గోదాంను ఆయన పరిశీలించారు.

మాడ్గులపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులైన ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలో రుణమాఫీ కాని రైతులు ఏఈవోకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు ఇంటింటి సర్వే చేపట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

శాలిగౌరారం: అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచిదని బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేష్ అన్నారు. రైతు రుణమాఫీ విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఇప్పటి వరకు రైతులకు 50శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదన్నారు.

శాలిగౌరారం: మండలంలోని మూసీ నది పరివాహక ప్రాంత గ్రామాలు మనిమద్దె, గురజాల, తుడిమిడిలో ఇసుకను ప్రజల అవసరాలకు శ్యాండ్ టాక్స్ ద్వారా నడస్తుంది. ఆన్‌లైన్‌లో ఇసుకను బుకింగ్ చేసుకొన్న రెండు, మూడు రోజుల్లో ఇసుక వారి ఇంటి ముందుకు వస్తుంది. తుడిమిడి ఇసుక రీచ్ ద్వారా బుకింగ్ చేసుకుంటే సకాలంలో రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చండూరు రూరల్: మండలంలోని పుల్లెంల గ్రామానికి చెందిన చాపల వెంకులు, ముక్కముల మంగమ్మ, పోలె చంద్రయ్య, జంపాల అనిత, ముక్కముల రమేష్‌లకు సీఎం సహాయ నిధికి నుంచి మంజూరైన మంజూరైన చెక్కులను పుల్లెంల గ్రామశాఖ అధ్యక్షుడు వడ్డగోని చంద్రశేఖర్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సీత యాదయ్య, నాయకులు పాలకూరి బిక్షమయ్య, నాయకులు ఇరిగి బుచ్చయ్య, సత్తయ్య, వెంకన్న, గండు కేశవులు, నరేష్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: మోదీ పాలనలో పెరుగుతున్న నిత్యావసర వస్తు ధరలకు వ్యతిరేకంగా సెప్టెంబరు 2వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తెలిపారు. పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, నాయకులు శ్రావణ్‌కుమార్, వీరస్వామి, వెంకటరమణ, నర్సింహ, వెంకటేశ్వర్లు, రామచంద్రం, అంజయ్య పాల్గొన్నారు.

చండూరు: చండూరు పట్టణంలోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్మి స్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపి వేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పేర్ల గణేష్ డిమాండ్ చేశారు. మునిసిపల్ కమిషనర్ వెంకటమణికరణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

హాలియా: అనుముల మండలం వీర్లగడ్డతండాకు చెందిన క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ లచ్చిరాంనాయక్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా లచ్చిరాంనాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిచారు.

చండూరురూరల్: మాదగోని నర్సింహ పేదల గుండెల్లో నిలిచిన నాయకుడని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య అన్నారు. మండలంలోని బంగారిగడ్డ ఎక్స్ రోడ్డు దగ్గర ఉన్న ఆయన స్థూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్, నాయకులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: చత్తీస్‌ఘడ్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా 16వ నేషనల్ మాన్‌సూన్ ప్రత్యక్ష శిక్షణ తరగతుల్లో నకిరేకల్‌కు చెందిన కరాటే కోచ్ ఆల్వాల అంజి ఇంటర్నేషనల్ బ్లాక్ బెల్ట్ మొదటి డిగ్రీలో ఉత్తీర్ణత, జపాన్ కరాటేలో మెంబర్ షిప్ సాధించినట్లు తెలిపారు.

మిర్యాలగూడ అర్బన్: కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతున్న కేక్‌ను ఓ బేకరి యాజమాన్యం విక్రయించింది. ఒక వ్యక్తి తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం సాగర్ రోడ్డుపై గల బేకరీలో కేక్ కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాడు. కేక్ కట్ చేసేందుకు ప్యాకింగ్ తెరువగా దుర్వాసన వచ్చింది. దీంతో సదరు వినియోగదారులు షాపు వద్ద కొచ్చి యాజమానిని నిలదీశాడు. కేక్ చూసిన యజమాని వేరేది ఇస్తాం తీసుకెళ్లండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేయగా వైరల్‌గా మారింది.